క్లుప్తంగా

ప్రశాంతంగా 'ఓట్ ఫ్రం హోం'

ఆర్మూర్‌టౌన్/కమ్మర్‌పల్లి/బాల్కొండ: 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిన 'ఓట్ ఫ్రం హోం' ప్రశాంతంగా సాగుతోంది. ఓట్ ఫ్రం హోం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు ఎన్నికల సిబ్బంది గురువారం వెళ్లి ఓటింగ్‌ప్రక్రియను పూర్తి చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో మొత్తం 489 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటిరోజు 230 మంది ఓటు వేశారు. చిన్న బజార్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కమ్మర్‌పల్లి మండలంలో 116 మందికిగాను 82 మంది ఓటు వేశారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో సైతం ఓట్ ఫ్రం హోం దరఖాస్తుదారులు తమ ఓట్లు వేశారు. ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖోఖో పోటీల్లో కేజీబీవీ సత్తా

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు 42వ ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సత్తాచాటి ప్రథమ స్థానం సాధించారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది గురువారం అభినందించారు. ఎస్‌వో భవాని, పీఈటీ స్రవంతి పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభ్యాసం చేయాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా సంక్షేమ అధికారి ఎస్‌కె రసూబీ అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రసూబీ మాట్లాడుతూ.. బాలల కోసం ప్రభుత్వాలు ఎన్నో సురక్షితమైన పథకాలను తీసుకువస్తున్నాయన్నారు. బాల్య న్యాయ, పోక్సో, విద్యాహక్కు వంటి కీలక చట్టాలను అమలు చేస్తున్నదన్నారు. సీడీపీఓ భార్గవి, సూపర్ వైజర్ నళిని, హెచ్‌ఎం ముజీబొద్దీన్, డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా సమన్వయకర్త స్వప్న, లింగ నిపుణురాలు సౌమ్య, పుష్ప, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు దేశ భవిష్యత్తును మారుస్తుంది

ఆర్మూర్‌టౌన్: ప్రజాస్వామ్యానికి ఓటు పునాదని, దేశ భవిష్యత్తును మార్చివేస్తుందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మనాయక్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మనాయక్ మాట్లాడుతూ.. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేసేలా అవగాహన కల్పించాలని, విస్తృత ప్రచారం చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, రంగోళి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి సురేశ్, డీఆర్డీవో చందర్, జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎస్‌కె రసూల్ బీ, నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ శైలీ బెల్లా ల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఆమేర్ కుటుంబానికి కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. బీటెక్ చదువుతున్న ఆమేర్ రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సునీల్‌రెడ్డి రూ.10 వేలు పంపించగా, స్థానిక నాయకులు రవి, రఫీ, శేఖర్ బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు.

ఒడ్డెర సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా సాయిలు

రెంజల్(బోధన్): ఒడ్డెర సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా వీరన్నగుట్టకు చెందిన ఎత్తరి సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని ఒడ్డెర సంఘం నాయకులు గురువారం సమావేశమయ్యారు. కార్యదర్శిగా ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా నరేశ్, రంగయ్య, ముఖ్య సలహాదారులుగా హన్మంతు, గంగారెడ్డి, ప్రధానకార్యదర్శిగా గంగా, కోశాధికారిగా రాజన్, సంయుక్త కార్యదర్శిగా శేఖర్, ఆర్గనైజర్‌గా బాబు, సలహాదారులుగా లక్ష్మణ్, చిన్న సాయిలు, ఎంకయ్య, నాగయ్య, సాయబ్‌రావు, లక్ష్మణ్, శ్యామ్‌రావును ఎన్నుకున్నారు.

ఆలయాల వార్షికోత్సవం

రెంజల్(బోధన్): రెంజల్ మండల కేంద్రంలో ముత్యాలమ్మ ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలను గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. పోతరాజు మదన్, కర్కెల్లి గంగాధర్, పోచయ్యతోపాటు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో పెద్దమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవ వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. మహేశ్, అరుణ్, శ్రీనివాస్, గంగాధర్, భూమన్న, ఎల్లయ్య, రంజిత్, శ్రీకాంత్, రాకేశ్, చరణ్, రమణాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరికి రూ.500 బోనస్ ఇస్తాం

- ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ
- బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి



కోనాసముందర్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి



హాజరైన కోనాసముందర్ గ్రామ మహిళలు

కమ్మర్‌పల్లి/వేల్పూర్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే క్వింటాల్ వరికి రూ.500 బోనస్ ఇస్తామని ఆ పార్టీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలం అమీర్ నగర్, కోనాసముందర్, వేల్పూర్ మండల కేంద్రంతోపాటు పడగల్‌లో సునీల్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళ ఖాతాలో ప్రతినెల రూ.2500 జమ చేస్తామన్నారు. రైతుకు పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు అందిస్తామని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల సాయం అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేస్తామని తెలిపారు. టీఆర్ఎస్‌ను నమ్మి మోసపోయామని, ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని, బాల్కొండ ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, వేల్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, రాజేందర్, టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్, నాయకులు జైడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గత పాలకులు భీమ్‌గల్‌ను పట్టించుకోలేదు



మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్ : గత పాలకులు భీమ్‌గల్ ప్రాంతాన్ని పట్టించుకోలేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కారెపల్లి, దేవన్‌పల్లి తండాలతోపాటు భీమ్‌గల్ పట్టణంలో ప్రశాంత్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చి, గిరిజనులను వారి భూములకు రాజులను చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో.. మీ తండాలను మీరే పాలించుకునే అవకాశం వచ్చిందన్నారు. భీమ్‌గల్ ప్రాంతాన్ని గత పాలకులు సాగునీటి పరంగా అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ ప్రాంతానికి శాశ్వతంగా ఉపయోగపడేలా ప్యాకేజీ-21 పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఎస్ఆర్ఎస్‌పీ బ్యాక్ వాటర్‌ను బినోలా నుంచి సారంగ కాలువ ద్వారా మెంట్రాజ్‌పల్లి పంప్‌హౌజ్‌కు తరలించి అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా మన ప్రాంతంలోని కప్పల వాగులోకి కాళేశ్వరం జలాలు తీసుకొచ్చి పారించుకున్నామని గుర్తు చేశారు. డెబ్బై ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ వాళ్లు మంచి నీళ్లు కూడా ఇవ్వలేక పోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కరెంట్ సమస్యలు తొలగిపోయాయని అన్నారు.

పింఛన్లు తొలగించే అధికారం ఎవరికీ లేదు



కోనాపూర్‌లో మహిళలతో ఏలేటి అన్నపూర్ణ

కమ్మర్‌పల్లి: ఓట్లు వేయకుంటే పింఛన్లు తొలగించే అధికారం ఎవరికీ లేదని బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు భయపడొద్దని సూచించారు. నియోజకవర్గ ప్రజలందరూ ధైర్యంగా ఉండాలని, బాల్కొండలో బీజేపీ గెలిచిన వెంటనే మొట్టమొదలు అర్హులందరికీ పింఛన్లు వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు గెలిస్తే పార్టీ మారబోమని గ్యారంటీ ఇస్తారా అని ప్రశ్నించారు. బాల్కొండలో బీజేపీని గెలిపిస్తే అర్హులందరికీ ఇండ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. బాల్కొండలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే ఎప్పుడూ చూడనంత అభివృద్ధి చేసి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కొత్తగా రూ.400 సిలిండర్ ఇస్తామని చెప్పన్నారని, ప్రస్తుతం అధికారంలో ఉండి కూడా ఇయ్యనిది.. మళ్లీ గెలిస్తే ఇస్తామనడం కేసీఆర్ అసమర్థ పాలనకు నిదర్శనమని విమర్శించారు. మండల అధ్యక్షులు కట్ట సంజీవ్, బీజేవైఎం అధ్యక్షుడు నిరంజన్, భాస్కర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



రుద్రూర్: కార్తీక ఏకాదశిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో మహిళలు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో దేవతామూర్తులకు అభిషేకం, పుష్పలంకరణ చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పండరీపూర్ సాంప్రదాయాన్ని అనుసరించి గత నెల పౌర్ణమి నుంచి ఆలయంలో ప్రతి రోజూ కాకడ హరతి, పూజలు నిర్వహిస్తున్నారు. ద్వాదశి సందర్భంగా శుక్రవారం అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిదుర వీరేశం, గెంటీల సాయిలు తెలిపారు.

అభ్యర్థులకు మద్దతుగా జోరుగా ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల శ్రేణులు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. పార్టీల మేనిఫెస్టోలను ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళ్తున్నాయి. ముప్కాల్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి ప్రచారం చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మరోసారి గెలిచి హ్యాట్రిక్‌సాధించాలని కోరుతూ ఆలూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్ట వరకు పాదయాత్ర చేశారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రెంజల్ మండల కేంద్రంలో, బోధన్ పట్టణంలో ఎన్నికల ప్రచారం చేశారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

వర్ని: మండలంలోని పాత వర్ని, జలాల్‌పూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు గురువారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి భాస్కర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజలు ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలా?



హున్సా మాజీ సర్పంచ్ శివరాజ్‌పటేల్‌కు కండువా కప్పుతున్న సుదర్శన్ రెడ్డి

- నిజాంసాగర్స్ స్వాధీనం హామీ ఏమైంది?
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



పెగడాపల్లిలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్: రెండు సార్లు షకీల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలు తమ సమస్యలు, అభివృద్ధి పనులపై నిలదీస్తే కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపణలు చేస్తున్నారని, ఆయనను ఎందుకు అడ్డుకుంటారని కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఓటు వేయకపోతే పింఛన్ రాదని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను భయపెడుతున్నట్లు తన దృష్టి తీసుకొచ్చిందని, అలాంటి పరిస్థితి వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. సాలూర మండలంలోని సాలూర క్యాంప్, బోధన్ మండలంలోని పెగడాపల్లి, నాగన్‌పల్లి గ్రామాల్లో సుదర్శన్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లో నిజాంషుగర్స్‌ను స్వాధీనం చేసుకుంటామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ మూతపడి తొమ్మిదేళ్లవుతున్నదన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండాపోయయాని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను వివరించారు. తాము అధికారంలోకి రాగానే పక్కాగా అమలు చేస్తామన్నారు. సాలూర మండలంలోని హున్సా గ్రామ మాజీ సర్పంచ్ శివరాజ్ పటేల్ సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు సుదర్శన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల నాయకులు గంగాశంకర్, మందర్న రవి, రమేశ్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు



జీవన్‌రెడ్డికి తీర్మానప్రతిని అందజేస్తున్న క్షత్రియ కులస్తులు

పెర్కిట్(ఆర్మూర్): సీఎం కేసీఆర్ పాలనపై నమ్మకంతో బీఆర్ఎస్‌లో చేరుతున్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కులసంఘాల సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని భావిస్తున్న వారందరూ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాక్లూర్ మండలం మానిక్‌బండార్‌కు చెందిన మాల, మాదిగ, పద్మశాలీ సంఘాల సభ్యులు, ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ, నాయక్‌పోడు, మిత్ర సంఘం, గౌడ, ఒడ్డెర సంఘం సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే ఆర్మూర్ నియోజకవర్గ గంగపుత్ర కులస్తులు, క్షత్రియ సమాజ్ కులస్తులు తమ పూర్తి మద్దతు బీఆర్ఎస్‌కే అని తీర్మానం చేయడంతోపాటు తీర్మానప్రతులను జీవన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ బాలకిషన్, ఆర్మూర్ అధ్యక్షుడు అంతాజి మదన్‌మోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపవన్, కౌన్సిలర్లు ఖాందేశ్ సంగీత, అల్జాపూర్ రేవతి, అల్జాపూర్ మహేందర్, సోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సేవలు అభినందనీయం



అవార్డులు అందుకున్న కండక్టర్లు, డ్రైవర్లతో ఆర్టీసీ అధికారులు

బోధన్: ఆర్టీసీ కార్మికుల సేవలు అభినందనీయమని బోధన్ టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఉత్తమ సేవలందించిన కండక్టర్లు, డ్రైవర్లకు గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, నిజామాబాద్ డిప్యూటీ ఆర్ఎం శంకర్‌నాయక్‌తో కలిసి ఉత్తమ ఉద్యోగులకు సంస్థ అందించిన ప్రగతి రథ చక్రాలు, క్యాష్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. డిపో రూ.5 కోట్ల నష్టాల్లో ఉండగా, కార్మికులు, ఉద్యోగుల సమష్టి కృషితో రూ. 4 కోట్ల నష్టాలను తగ్గించామని, మరో రూ.కోటి నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. డిపో సీఐ జానాబాయి, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరులకే సంక్షేమ పథకాలు

- బోధన్ బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి



నవీపేటలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నవీపేట : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే షకీల్ తన అనుచరులకే వర్తింపజేశారని బోధన్ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి ఆరోపించారు. నవీపేట మండల కేంద్రంతోపాటు నందిగామ, యంచ, అల్జాపూర్, మిట్టాపూర్, కోస్లీ, ఎల్‌కె ఫారం, ఫతేనగర్, రాంపూర్‌లో మోహన్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మెల్యే స్థానానికి తాను మొదటిసారి పోటీచేస్తున్నానని, తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. గతంలో మంత్రిగా పని చేసిన సుదర్శన్‌రెడ్డి, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన షకీల్ అభివృద్ధిని విస్మరించారన్నారు. గెలిచాక అందుబాటులో లేకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. సమస్యలపై నిలదీస్తే బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఖండించారు. సామాన్యులకు అండగా ఉన్న బీజేపీ మేనిఫెస్టోతో విశేష ఆదరణ లభిస్తున్నదన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, నాయకులు ద్యాగ సరిన్, వంశీమోహన్, నాగేశ్వర్‌రావు, రచ్చ సుదర్శన్, శైలేశ్‌కుమార్, ఆనంద్, రామకృష్ణ, రాజేందర్‌గౌడ్, రాజశేఖర్, లక్ష్మణ్, ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మానికోళ్ల గంగాధర్, ఆకారం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే తండాల అభివృద్ధి



పార్టీలో చేరినవారితో పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు, అమ్రాద్ గ్రామానికి చెందిన మెగావత్ భీమ్‌సింగ్ నాయక్ వంద మంది అనుచరులతో కలిసి గురువారం బీజేపీలో చేరారు. అంకాపూర్‌లోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తండావాసుల సౌకర్యార్థం వంతెన కూడా కట్టని అసమర్థ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని, జీవన్‌రెడ్డికి తండా ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. తండాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఈ సందర్భంగా పార్టీలోచేరిన వారు పేర్కొన్నారు. బీజేపీలో చేరిన వారిలో పీర్ సింగ్, గంగాధర్, కేపీ సింగ్, మంగ్యా, శంకర్ తదితరులున్నారు.

ఉపసర్పంచ్‌ల చేరిక..

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్ మండలంలోని లక్కంపల్లి ఉపసర్పంచ్ మయాపూర్ శ్రీనివాస్, చింరాజ్‌పల్లి ఉపసర్పంచ్ భూపతి, మల్లారం ఉపసర్పంచ్ నర్సారెడ్డి గురువారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పైడి రాకేశ్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మంగళవారం (తెలుగు)- 12.25, 7.00
టైగర్-3 (తెలుగు)-3.35, 10.10
స్క్రీన్-2 – ఆదికేశవ (తెలుగు)- 11.00, 1.50, 4.40, 7.30, 10.20
స్క్రీన్-3 – కోటా బొమ్మాళి పీఎస్ (తెలుగు)- 10.00, 1.00, 7.10, 10.10
మంగళవారం (తెలుగు)- 4.00
స్క్రీన్-4 – టైగర్-3 (హిందీ)- 10.15,
మాధవే మధుసూదనా (తెలుగు) 4.00
సౌండ్‌పార్టీ(తెలుగు)7.00
ఫర్‌పూమ్ (తెలుగు) 9.45

పేదల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

- బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్



బినోలలో మాట్లాడుతున్న షకీల్

నవీపేట: పేదల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే షకీల్ అన్నారు. మండలంలోని నాళేశ్వర్, నిజాంపూర్, బినోల, మోకాన్‌పల్లి, నాగేపూర్, కోస్లీ గ్రామాల్లో షకీల్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసరా పింఛన్లు, జీవనభృతి, కళ్యాణలక్ష్మి, షాదీముబారకర్ వంటి సంక్షేమ పథకాలు నిరుపేదలను కష్టకాలంలో ఆదుకుంటున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే భూముల ధరలు పెరిగి యజమానులను తలెత్తుకునేలా చేసిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలను ఎత్తేస్తారని, భూముల ధరలను పడగొడతారని అన్నారు. మంత్రిగా అభివృద్ధిని విస్మరించిన సుదర్శన్‌రెడ్డి పేదలను అంటరానివారిగా చూస్తారని ఆరోపించారు. వడ్డీలతో అమాయకుల రక్తం పిండిన మోహన్‌రెడ్డి మళ్లీ దోచుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జడ్పీటీసీ సవిత, నాయకులు నర్సింగ్‌రావు, బుచ్చన్న, మగ్గారి హన్మాండ్లు, న్యాలకంటి అబ్బన్న, సంజీవ్‌రావ్, గౌరు రాజు, గొంటి రాజు, పితాంబర్, జనార్దన్, రాజేశ్వర్, బాబర్, మౌలానా, రమేశ్, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే దాడులు

ఎడపల్లి/ బోధన్/రెంజల్ : బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పథకం ప్రకారమే దాడులు చేశారని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, ఎడపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. ఎమ్మెల్యే షకీల్ ప్రచారాన్ని అడ్డుకోవడంతోపాటు దాడి చేయడాన్ని ఆ పార్టీ నాయకులు ఖండించారు. ఆయాచోట్ల విలేకరులతో మాట్లాడారు. సాటాపూర్ గేట్‌వద్ద కాంగ్రెస్ నాయకులు గుమిగూడి ఉద్దేశపూర్వకంగా షకీల్‌పై దాడికి పాల్పడ్డారని డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, నాయకుడు బుద్దె రాజేశ్వర్ ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తే భయపడేది లేదని, వారి దౌర్జన్యాన్ని సహించేది లేదని బోధన్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌కు పరిమితమవుతారని, ఆయనను నమ్ముకుని కేసుల్లో ఇరుక్కోవద్దని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు రెంజల్‌మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భూంరెడ్డి సూచించారు.

రౌడీ రాజకీయం మానుకోవాలి

ఎడపల్లి(బోధన్): బీఆర్ఎస్ రౌడీ రాజకీయం మానుకోవాలని బీజేపీ బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, మండల అధ్యక్షుడు ఇంద్రకరణ్ అన్నారు. ఎడపల్లిలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజలు నిలదీస్తుండడంతో బీఆర్ఎస్ వాళ్లు బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు.